క్లుప్తంగా

అంకమ్మతల్లికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో అంకమ్మతల్లి

విడవలూరు : విడవలూరు గ్రామదేవత అంకమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు కొర్నా గిరి అమ్మవారికి ప్రత్యేకాలంకారణ చేశారు. అనంతరం అభిషేకాలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

పూరిల్లు దగ్ధం



కోవూరు : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని వేగూరు గిరిజన కాలనీలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వేగూరు గిరిజన కాలనీకి చెందిన ఈగ సావిత్రమ్మ రోజులానే కూలి పనులకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. బాధితురాలు వచ్చి చూసేసరికి ఇంటితో పాటు గృహోపకరణాలు మొత్తం కాలిపోయింది. ఈ మేరకు జరిగిన విషయాన్ని ఆమె రెవెన్యూ అధికారులకు తెలియజేశారు.

మోటార్‌బైక్ చోరీకి యత్నం

- దొంగకు దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దుకాణం ఎదురుగా నిలిపిన బైక్‌ను దొంగచాటుగా తీసుకెళ్తున్న బిహార్ ప్రాంతానికి చెందిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన వెంకటేశ్వరపురం సెంటర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వెంకటేశ్వరపురం సెంటర్‌లో ఓ వ్యక్తి పాల దుకాణానికి వెళ్లగా అతని బైక్‌ను బిహార్ వ్యక్తి స్టార్ట్ చేసి ముందుకెళ్లాడు. వెంటనే స్థానికులు గుర్తించి సదరు వ్యక్తిని వెంబడించి బైక్‌ను ఆపి దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతన్ని అదుపులో తీసుకుని విచారిస్తున్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ గల 29 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను ఆదివారం అందజేశారు. అలాగే మరో ఇద్దరు నిరుపేదలకు వైద్యం కోసం ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 31 మందికి రూ.10 వేల చొప్పున రూ.3.10 లక్షల నగదును అందజేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ములుముడి ఉదయ్‌కుమార్, మేనేజర్ నరసింహం, కోశాధికారి శ్రీనివాసరావు, ఆడిటర్ సూర్యనారాయణ, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, డాక్టర్ వై.సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ పీఎస్ కార్తీక్, డాక్టర్ చక్రధర్‌రావు, ఎ.జయప్రకాష్, మైపాడు రాజాశర్మ, గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

అద్వైత భారత్ పుస్తకావిష్కరణ

నెల్లూరు(బారకాసు): పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో చతుర్వేదుల చెంచు సుబ్బయ్య రచించిన అద్వైత భారత్ అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక రేబాలవీధిలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అవారు శ్రీధర్‌బాబు పుస్తక సమీక్ష చేశారు. అనంతరం రచయిత మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం అనే గొప్ప ఆశయంతో ఉన్న మన దేశంలో కల, మత, ప్రాంతీయ ద్వేషాలు ఉన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు చేసే ప్రయత్నమే ఈ నవల అని పేర్కొన్నారు. ఇందులో కార్యదర్శి టి.సులోచన, మోపూరు పెంచల నరసింహం, అన్నం శివకృష్ణ, మక్తాల నరేంద్ర, కూని అంకబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

29న బలిజల ఆత్మగౌరవ సభ

కావలి: నెల్లూరులోని ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం వద్ద ఉన్న కాపు భవన్‌లో ఈ నెల 29న బలిజల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు రాయలసీమ బలిజ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు వెలిశెట్టి శ్రీహరి రాయల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కలిగిన పేద బలిజ విద్యార్థులకు ఉపకారవేతనాలు, బలిజ బంధు పురస్కారాలను అందజేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని బలిజ సామాజిక వర్గీయులందరూ హాజరుకావాలని కోరారు.

రైతులకు రాయితీలు.. ఎన్నో నిబంధనలు

- పశువుల యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం అవకాశం
- నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌లో 50 శాతం రాయితీ
- పాలు, మాంసం ఉత్పత్తుల యూనిట్లకు రుణాలు
- బ్యాంకుల్లో రుణాల మంజూరు బాధ్యత రైతులదే..

పొదలకూరు: గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, నిరుద్యోగులు పశుపోషణ ద్వారా ఆర్థిక పురోగతి సాధించేందుకు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద పశువుల యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని రైతులు వెల్లడిస్తున్నారు. బ్యాంక్ రుణాలు పొందగలిగితే కేంద్రం ప్రభుత్వం అందజేసే రాయితీలతో ఉపయోగం ఉంటుందని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. కాగా రుణాలు పొందడంలో పూర్తిగా అన్నదాతలే బాధ్యత వహించాలి. దీంతో బ్యాంకర్ల నుంచి రుణాలు పొందాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పశుసంవర్థక శాఖ అధికారులు గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. బ్యాంకర్లు సమ్మతించి రైతులకు లోన్లు మంజూరు చేస్తే రూ.కోటి వరకు యూనిట్లను ఏర్పాటు చేసుకునే వెసలుబాటు ఉంటుంది. పాలు, మాంసం ఉత్పత్తులను పెంపొందించుకుని స్థానికంగా కొందరికి ఉపాధి అవకాశాలు కూడా కల్పించవచ్చని వెల్లడిస్తున్నారు. గొర్రెలు, కోళ్లు, పందులు పెంపకంతో పాటు పశుగ్రాసం దాణా తయారీలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించే యూనిట్లను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందంటున్నారు.



ఎన్ఎల్ఎంలో ఏర్పాటు చేసిన గొర్రెల యూనిట్ (ఫైల్)



గొర్రెలకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి

అంత సులువు కాదు

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ రాయితీలు పొందడం అంత సులువేమి కాదు. లబ్ధిదారుడు ఏర్పాటు చేసే ప్రాజెక్ట్‌పై శిక్షణ పొంది ఉండాలి. నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్ట్ నివేదిక తయారు చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. రాయితీ పోను మిగిలిన యూనిట్ ఖరీదు కోసం బ్యాంక్ రుణాలను పొందేందుకు అవసరమైన పత్రాలను సమర్పించి అనుమతి పొందాలి. లబ్ధిదారుడు తన సొంత లేదా కౌలు భూమిలో మాత్రమే యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారమే లైవ్ స్టాక్ మిషన్‌కు దరఖాస్తులను పంపడం జరుగుతుంది.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



జాతీయ లైవ్ స్టాక్ మిషన్ అందజేస్తున్న రాయితీలను గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవచ్చు. గ్రామాల్లో వారికి ఎలాగూ భూములు ఉండటంతోపాటు పశుపోషణపై అవగాహన ఉన్నందున యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. యూనిట్ ఖర్చులో 50 శాతం ప్రభుత్వం అందజేస్తున్నందున యువత ముందుకు రావాలి.

– డాక్టర్ సి.మురళీకృష్ణారెడ్డి, పశువైద్యాధికారి, తాటిపర్తి, పొదలకూరు మండలం

యూనిట్ల ఏర్పాటు ఇలా..

రైతులు లేదా నిరుద్యోగులు మాంసం ఉత్పత్తులను పెంపొందించేందుకు గొర్రెలు, పొట్టేళ్ల యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. గరిష్ఠంగా ఎన్ఎల్ఎం కింద రూ.కోటి వరకు బ్యాంక్ రుణాలను పొందే అవకాశం ఉంది. రూ.కోటి రుణం పొంది యూనిట్‌ను ఏర్పాటు చేస్తే రూ.50 లక్షలు రాయితీ లభిస్తుంది. అంతకంటే తక్కువ ఖర్చుతో యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నా 50 శాతం సబ్సిడీని అందజేస్తారు. 500 గొర్రెలు, మేకలు+పొట్టేళ్లు, మేకపోతులు 25 కలిగిన యూనిట్‌ను రూ.50 లక్షలతో ప్రారంభిస్తే ఎన్ఎల్ఎం కింద రూ.50 లక్షల వరకు రాయితీ ఇస్తారు. 1,000 పెట్టకోళ్లు+100 పుంజులు, పెరటికోళ్లు, కోడిపిల్లల యూనిట్, పొదుగు కోళ్ల యూనిట్ ఏర్పాటు చేస్తే 50 శాతం రాయితీని అందజేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. పందుల పెంపకానికి కూడా రాయితీ ఇస్తున్నారు. 100 ఆడపందులు, 10 మగపందుల యూనిట్ పెడితే రూ.60 లక్షల యూనిట్ వరకు 50 శాతం రాయితీ ఇస్తారు. ఇంతకన్నా తక్కువ ఖర్చుతోను యూనిట్లను ఏర్పాటు చేసుకుంటే రాయితీ వర్తిస్తుంది.

హ్యాండ్‌బాల్ పోటీల చాంపియన్‌గా సత్యసాయి జిల్లా



మూడో స్థానంలో నిలిచిన నెల్లూరు జట్టు

కోవూరు: రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ మహిళల చాంపియన్‌గా సత్యసాయి జిల్లా జట్టు నిలిచింది. మండలంలోని పాటూరు జెడ్పీ హెచ్‌ఎస్‌లో రాష్ట్రస్థాయి పోటీలు ఆదివారం జరిగాయి. ఇందులో రెండో స్థానంలో వైఎస్సార్ కడప, మూడో స్థానంలో నెల్లూరు, నాలుగో స్థానంలో పశ్చిమ గోదావరి జట్లు నిలిచాయి. కార్యక్రమంలో ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు, హెచ్ఎం వెంకటేశ్వర్లునాయుడు, నిర్వాహకుడు భీమతాటి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

కోవూరు: గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీలో గణిత దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్అండ్‌హెచ్ విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో తొలుత శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ భారతీయ గణిత శాస్త్రానికి శ్రీనివాస రామానుజన్ అమూల్యమైన సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్అండ్‌హెచ్ విభాగాధిపతి కిశోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై.మురళీకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ సందీప్‌కుమార్

అధ్వానంగా పారిశుద్ధ్యం



దోమలకు ఆవాసంగా మారిన విడవలూరు సాగునీటి కాలువ

- గ్రామాల్లో దోమల బెడద

విడవలూరు: మండల కేంద్రమైన విడవలూరుతో సహా అన్ని గ్రామాల్లో దోమల బెడద రోజురోజుకు అధికమవుతోంది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో కాలువలు అధ్వానంగా మారింది. ఫలితంగా గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరగడంతో ప్రజలకు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. మనుషులకే కాక పాడి పశువులు కూడా దోమల వల్ల రాత్రంతా నిద్రలేక పాల దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు గ్రామాల్లోని పారిశుద్ధ్యంపై దృష్టి సారించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, పాడి రైతులు కోరుతున్నారు.

అలా వెలుగుతూనే..



సుబ్బారెడ్డిపాళెం కూడలిలో..



ముత్తుకూరు బీసీ కాలనీలో..

మండలంలో కొన్నిచోట్ల వీధి లైట్లు పట్టపగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. ముత్తుకూరు బీసీ కాలనీ, ఆర్అండ్ఆర్ కాలనీ, నారికేళపల్లి, బలిజపాళెం, సుబ్బారెడ్డిపాళెం, కోళ్లమిట్ట తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. వీటిని ఆపకుండా సంబంధిత సిబ్బంది చోద్యం చూస్తున్నారు.

– ముత్తుకూరు

రేపు జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

కోవూరు: మండలంలోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 24వ తేదీ జిల్లా బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహకుడు టి.లవకుమార్, కార్యదర్శి జె.విజయానందం, ఉపాధ్యక్షుడు పూండ్ల డేవిడ్‌జాన్సన్ తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోమ్ వద్ద ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 19 ఏళ్లలోపు బాల, బాలికలు అర్హులని, ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలని తెలియజేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు బైనా లక్ష్మీకాంతం, శ్రీధర్‌రెడ్డి, ఈసీ మెంబర్ సింహాద్రి, జి.శ్రీనివాసులు, కె.కొండలరావు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ కూల్చివేతపై ఫిర్యాదు

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ కూల్చివేతపై ఆదివారం హెచ్ఎం ఎం.ఫెర్సిస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం కొందరు అక్రమంగా ప్రహరీతోపాటు పక్కనే ఉన్న వాటర్ ట్యాంక్‌ను జేసీబీతో కూల్చి వేసి అక్కడి మట్టిని ట్రాక్టర్లలో తరలించారు. దీనిపై స్పందించిన హెచ్ఎం పోలీసులకు పేర్లు సూచించకుండా కొందరు తమ పాఠశాల ప్రహరీని కూల్చారని రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రెండు రోజులుగా సెలవులో ఉన్నానని ఉపాధ్యాయుల ద్వారా గోడ కూల్చివేతపై సమాచారం తెలిసిందన్నారు. స్వయంగా వచ్చి పరిశీలించగా మంచినీటి ట్యాంక్‌ను కూడా కూల్చినట్టు చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులు తమదిగా చెప్పుకొంటున్న స్థలం దశాబ్దాలుగా పాఠశాల ఆవరణలో ఉందన్నారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి అధికారులకు కూడా నివేదిక పంపించినట్టు వెల్లడించారు. హెచ్ఎం వెంట ఉపాధ్యాయుడు నాగిరెడ్డి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గూడూరు పట్టణానికి చెందిన మురళీధర్ పని నిమిత్తం బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లాడు. తిరిగి గూడూరుకు వెళ్తుండగా తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రహదారిపై బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో మురళీధర్‌కు గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

నడిరోడ్డుపై పశువులు



పొదలకూరు: పట్టణంలో పశువులు బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. నడిరోడ్డుపైనే తిష్ట వేస్తున్నాయి. బస్టాండ్, మెయిన్ రోడ్లపై తిరుగుతూ ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్నాయి. పంచాయతీ బస్టాండ్‌లో గుంపులుగా తిరుగుతున్న పశువుల వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వాటిని అదుపు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మనుబోలు: ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ



పొదలకూరులో..

మనుబోలు: మండలంలోని మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్ర శర్మ గ్రామదేవతలకు ప్రత్యేకాలంకరణ చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

- పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గ్రామాల్లో ప్రచారం



తోటపల్లిగూడూరు: త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ సభ్యులు ఆదివారం మండలంలోని వరకవిపూడి, అనంతపురం గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు సురమౌళి, సభ్యులు ప్రదీప్, పద్మావతి, శ్రీరామయ్య, కోటేశ్వరరావు, కొండమ్మ, అన్నపూర్ణ, నరసింహ ప్రసాద్, కల్పన, సుదర్శనమ్మ, రామయ్య, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్యంలో బుచ్చి మహిళకు డాక్టరేట్

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన మాటేటి నీరజ కల్యాణి జ్యోతిష్యంలో డాక్టరేట్ అందుకున్నారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరిగిన స్నాతకోత్సవంలో బెంగళూరుకు చెందిన ఎస్‌వీవీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను మాటేటి నీరజ కల్యాణికి అందజేశారు. దీంతో మండలంలోని పలువురు ఆమెను ఆదివారం అభినందించారు.



డాక్టరేట్ అందుకుంటున్న నీరజ కల్యాణి

కోడూరు చర్చిలో ప్రార్థనలు



తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు వేళాంగిణి చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చర్చి డైరెక్టర్ ఫాదర్ లూకాస్‌రాజ్ దైవ సందేశమిచ్చారు.

జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

తీరంలో సందడి



మండలంలోని కోడూరు బీచ్‌లో ఆదివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు విచ్చేశారు. చాలా కుటుంబాలు బీచ్‌లో కోలాహలంగా గడిపాయి.

– తోటపల్లిగూడూరు